క్లుప్తంగా

నూతన కమిటీ నియామకం

తాండూరు టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేందర్ సింగ్ ఠాకూర్, చిట్లపల్లి శ్రీకాంత్, ఎం.మహిపాల్, చిన్న మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.వెంకటేశం, కె.శ్రీశైలం, కార్యదర్శులుగా జి.శ్రీకాంత్, టి.నవీన్, కె.శ్రీనివాస్, బి గోపాల్, అసెంబ్లీ కన్వీనర్లుగా భానుతేజ, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

మహిళా దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ సామ్యారెడ్డి తదితరులు

కుల్కచర్ల: మ్యాజిక్‌బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సామ్యారెడ్డి మాట్లాడారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించి, కుటుంబ అభ్యున్నతిలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నర్సింలు, నరేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అప్పాజీ' సందడి



ముత్యా ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తులు

తాండూరు రూరల్: మల్లికార్జున ముత్యా (అప్పాజీ)స్వామి సోమవారం పట్టణంలో సందడి చేశారు. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా మహల్‌రోజ గ్రామానికి చెందిన ముత్యా.. అనుగ్రహం, ఆశీర్వాదం కోసం.. పలువురు శుభకార్యాలకు ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన రవిశంకర్.. తన పొలంలో అశ్రమం నిర్మాణం కొరకు భూమిని కేటాయించారు. ఈ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఆయన తాండూరుకు వచ్చారు.

శభాష్.. డ్రైవరన్నా

- గుంతలను పూడ్చించిన ప్రైవేటు ఉద్యోగి
- హర్షం వ్యక్తంచేసిన ప్రయాణికులు



బీటీరోడ్డుపై గుంతలను పూడ్చి వేస్తున్న ఆంజనేయులు

దోమ: అతనో ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్. అందులో సొంత డబ్బులు వెచ్చించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన రూట్‌లో ఆంజనేయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇదే మార్గం.. దోమ మండలం బొంపల్లి గ్రామ పరిధి రోడ్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం తవ్వి, పూడ్చివేసినప్పటికీ.. తవ్విన ప్రదేశంలో భారి గుంతలు ఏర్పడ్డాయి. ఇది వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఎవరూ పట్టించుకోక పోవడంతో సమస్య మరింత తీవ్రమయింది. దీన్ని గమనించిన డ్రైవర్.. మట్టితో పూడ్చి వేయించారు. దీంతో పలువురు శభాష్ ఆంజనేయులు అంటూ అభినందించారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిది అవకాశవాద రాజకీయం

మొయినాబాద్: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అవకాశవాద రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చిడిగిద్ద కృష్ణారెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం రాజకీయాలతో సంబంధం లేని రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదరించి, చేవెళ్ల ఎంపీని చేశారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు రంజిత్‌రెడ్డి రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలతో వేల కోట్లు సంపాదించుకున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆస్తులను కాపాడుకోవడం కోసం అధికార యావతో కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. రాజకీయ జీవితాన్నిచ్చిన కేసీఆర్‌ను, పార్టీని రంజిత్‌రెడ్డి వదిలివెళ్లడం ఆయన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

కొత్తూరు: ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో చేపట్టవద్దని కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 167లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి కూల్చి వేయించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



యాలాల: విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సీఐ అశోక్



పెద్దేముల్: హాల్ టికెట్ నంబర్లను చూస్తున్న స్టూడెంట్స్



ధారూరు: రూం నంబర్లను చెబుతున్న పోలీసులు

తొలి పరీక్ష ప్రశాంతం

- సీసీ కెమెరాలు, పోలీసుల పహారాలో టెన్త్ ఎగ్జామ్ సెంటర్లు
- పర్యవేక్షించిన విద్యాధికారులు
- సమయపాలన పాటించిన విద్యార్థులు

పెద్దేముల్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సీసీ కెమెరాల నిఘా, పోలీసుల పహారా, విద్యాధికారుల పర్యవేక్షణలో తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. పెద్దేముల్ మండల పరిధి బాలుర ఉన్నత పాఠశాలలో 198, బాలికల పాఠశాలలో 182, మంబాపూర్ పాఠశాలలో 194 (మొత్తం 574) మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. ఇద్దరు గైర్హాజరయినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ గిరి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సమీప ప్రాంతంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. పరీక్ష ముగిసే వరకు ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ షేక్‌సుష్మ పర్యవేక్షించారు.



పెద్దేముల్: సూచనలు చేస్తున్న ఎస్ఐ గిరి

యాలలలో ఐదుగురు గైర్హాజరు

యాలాల: మండల కేంద్రం బాలుర ఉన్నత, అగ్గ నూరు, ప్రతిభ, గౌతమి పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, కేజీబీవీ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. 715 మందికి గాను, ఐదుగురు గైర్హాజర్ అయినట్లు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. తాండూరు రూరల్ సీఐ అశోక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

దౌల్తాబాద్‌లో ఇద్దరు ఆబ్సెంట్

దౌల్తాబాద్: మండల కేంద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది, సీపీఎస్ పాఠశాలలో 221 గాను 219 మంది పరీక్ష రాయగా.. ఇద్దరు ఆబ్సెంట్ అయినట్లు విద్యాధికారులు తెలిపారు.

ధారూరులో ఇద్దరు..

ధారూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 170 మందికి, 168 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. ఇద్దరు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ బాబుసింగ్ తెలిపారు. కేరెళ్లి కేంద్రంలో 141 మందికి 141 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ నర్సింహులు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ధారూరు, కేరెళ్లి సెంటర్లను తనిఖీ చేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 902 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. బొంరాస్‌పేట మండలంలో 516 మంది పరీక్ష రాయగా.. ఒకరు ఆబ్సెంట్ అయినట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

తాండూరు టౌన్‌లో.. 12 మంది

తాండూరు టౌన్: తాండూరు పట్టణం, మండలంలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకుని, వారికి కేటాయించిన గదుల్లోకి వెళ్లారు. గతేడాది వలే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. 2,292 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 12 మంది గైర్హాజరయినట్లు అధికారులు పేర్కొన్నారు.

పరిగిలో..

పరిగి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో మొత్తం 1,492 మంది విద్యార్థులకు గాను 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 1,487 మంది పరీక్షకు హాజరు కాగా.. ఐదు మంది ఆబ్సెంట్ అయ్యారు. ఎంఈఓ హరిశ్చందర్ పర్యవేక్షించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మండల పరిధి కుల్కచర్ల బాలుర, బాలికల పాఠశాలలతో పాటుగా ముజాహిద్‌పూర్, పుట్టపహడ్ జడ్పీ, చౌడాపూర్ మండలంలో చౌడాపూర్, మరికల్ జడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో మొత్తం 1,078 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. ముగ్గురు గైర్హాజరయినట్లు మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ తెలిపారు.

99.58శాతం హాజరు



జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

అనంతగిరి: పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. నిర్ణీత సమయం కంటే విద్యార్థులు సెంటర్ల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 రెగ్యులర్ సెంటర్లు ఉన్నాయి. అందులో 13,410 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 13,353 మంది (99.58శాతం) హాజరయ్యారని, 57మంది గైర్హాజరయ్యారని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. జిల్లాలో 10 ప్రైవేట్ సెంటర్లు ఉండగా, అందులో 52గాను 42మంది విద్యార్థులు హాజరయ్యారని, 10 మంది ఆబ్సెంట్ అయ్యారని డీఈఓ పేర్కొన్నారు. వికారాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలుర సెంటర్‌ను కలెక్టర్ నారాయణ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ తదితర అధికారులు సెంటర్లను తనిఖీ చేశారు.



పెద్దేముల్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



దౌల్తాబాద్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పెద్దేముల్: తనిఖీ చేస్తున్న పోలీసులు



మర్పల్లిలో..



కొడంగల్: పరీక్ష కేంద్రం వద్ద సీఐ, ఎస్ఐ, ఎంఈఓ



తాండూరు టౌన్: ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది



దోమ: హాల్ టికెట్ నంబర్లను సరి చూసుకుంటున్న విద్యార్థులు



కుల్కచర్ల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్‌లో అకాల వర్షం

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలో సోమవారం సాయంత్రం సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో చెరుకు, మొక్కజొన్న పంటలకు లాభం చేకూరనుందని, పసుపు పంటను ఉడికించి, ఆర బెట్టిన రైతులకు నష్టం కలగనుందని పలువురు పేర్కొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

దోమ: ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్‌గా పనిచేసిన భారతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు శివ, భర్త హన్మయ్య సోమవారం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద విద్యార్థులకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫి, ఉపాధ్యాయులు నీల్‌సింగ్, వెంకటయ్య, శివశంకర్, శైలాజ, రుక్మిణి, గ్రామస్తులు ఉవగుంట యాదయ్య, నవీన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్లు..

పరిగి: చిట్యాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు.. ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సీసాలను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృంధం పూర్వ విద్యార్థులను అభినందించింది. సంఘం నాయకులు మోయిజ్‌ఖాన్, వీరారెడ్డి, మోహన్, శ్యాంసుందర్ ఉన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోనున్నట్లు కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించారు. నీటి వాడకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నీటిని వృథా చేయరాదని సూచించారు. ఆన్ ఆఫ్ లేని నల్లాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

బంట్వారం: కోట్లాది రూపాయలతో బంట్వారం మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎంపీపీ ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 11 గ్రామాల పరిధిలో 2024 సంవత్సరానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీరోడ్ల నిర్మాణానికి రూ.2.85 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే రోడ్ల నిర్మాణం పనులు పూర్తి కావస్తున్నాయని, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. బండమీదిపల్లి నుంచి బొప్పునారం, తాండూరు రోడ్డు తొర్మామిడి సబ్ స్టేషన్ నుంచి బస్వాపూర్ రీబీటీకి నిధులు వచ్చినట్లు పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల మరమ్మతుకు అవసరమైన నిధుల కోసం సంబంధిత అధికారులతో ప్రతి పాదనలు చేయించనున్నట్లు వివరించారు. నాయకులు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, నర్సింహరెడ్డి, రాధాకృష్ణగౌడ్, సంగమేశ్వర్, యాదగిరి, నర్సింలు ఉన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు

- తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

తాండూరు టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సువిధ, సీవిజిల్, సురక్ష, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా.. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ అనుసరించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. అక్రమంగా మద్యం, నగదు తరలించడం నేరమని, వాటిని నిరోధించడానికి కొత్లాపూర్, మైల్వార్, నవాంధ్గి గ్రామ సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రూ.50వేలు మించితే.. రసీదు తప్పనిసరి

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు, అధికారులు అప్రమత్తంగా ఉంటూ, నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదును వెంట తీసుకెళ్తున్నట్లయితే.. అందుకు సంబంధించిన రసీదు, వివరాలను ఉండేలా చూసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకులు అధికారిక వాహనాలను వినియోగించరాదని, అభ్యర్థి సెక్యూరిటీ వాహనాల్లోనూ మూడు కంటే ఎక్కువ ఉంటే.. ఎన్నికల వ్యయం కింద జమ కడతామని వివరించారు. ప్రభుత్వ వసతి గృహాలు, హెలీప్యాడ్‌లు, సభాస్థలాలు తదితరాలను కేవలం అధికార పార్టీ వారే వినియోగించుకోకుండా, ఇతర పార్టీల వారికి అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

పత్రికలు, టీవీల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార ప్రకటనలు ఇవ్వరాదని, ఇవ్వాలనుకుంటే ఈసీ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఎలాంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదన్నారు. కోడ్ నిబంధలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్లు తారాసింగ్, కిషన్, వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఏఓ లావణ్య, ఎస్ఐలు కాశీనాథ్, అశోక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా కల్యాణమహోత్సవం

నవాబుపేట: శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. మండల పరిధి ఎల్లకొండ గ్రామం పార్వతీ పరమేశ్వరుల దేవస్థానంలో సోమవారం ఉదయం వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పట్టు వస్త్రాలు సమర్పించి, సాంప్రదాయ పద్ధతిలో వేద పండితులు కల్యాణ ఉత్సవాన్ని జరిపించారు. అనంతరం పురాన కాలక్షేపంలో భాగంగా వేదపండితులు శివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి, గామ పెద్దలు, అర్చకులు శ్రీశైలం స్వామి, శివకుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు. చిత్రంలో భక్తులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె

ఏప్రిల్ 2 నుంచి ప్రారంభం

- తితిదే తరహాలో నిత్య కైంకర్యాలు



శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: వార్షిక బ్రహ్మోత్సవాలకు బాలాజీ నగర్ శ్రీవారి ఆలయం ముస్తాబవుతోంది. పేదల తిరుపతిగా పేరుగాంచిన కలియుగ వైకుంఠ దైవం పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు ఏప్రిల్ 2వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. వేడుకలను ఎప్పటిలాగే తితిదే తరహాలో నిర్వహించనున్నారు. ఇందుకు గాను ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల తిరుపతి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించే ఉత్సవాల్లో, నిత్య వాహన సేవలు, కైంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ వైభవంగా జరగనుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తితిదే తరఫున శేష వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

కార్యక్రమాలు..

2వ తేది మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 3న సేనాధిపతి ఉత్సవం, అంకురార్పన, 4న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేష వాహనం, 5న చిన్న శేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం, వ్యాళి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 8న మోహినీ అవతార ఉత్సవం, అమావాస్య పూలంగి సేవ, గరుడోత్సవం, లంకా దహనం, తితిదే నుంచి శేష వస్త్రాల సమర్పన, 9న హనుమంత వాహనం, వసంతోత్సవం, ఉగాది ఆస్థానం, గజ వాహనం, 10న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వ వాహనం, 12న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం 7గంటలకు ఊంజల్ సేవ, శ్రీబాలాజీ పాడుతా తీయగా కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటాయి.

మురుగు కాల్వల్లో పూడికతీత

పెద్దేముల్: 'గ్రామాల్లో సమస్యల తిష్ట' అనే శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన వార్తకు మండల అధికారులు స్పందించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. నిత్యం గ్రామాల్లో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. పెద్దేముల్ మేజర్ పంచాయతీ పలు వార్డుల్లో చెత్తాచెదారంతో నిండి ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయించారు. వీధుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అడ్కిచెర్లలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. మంబాపూర్ గ్రామంలో వీధి లైట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించినా, కార్యదర్శులు అందుబాటులో లేకపోయినా తమకు ఫిర్యాదు చేయాలని మండల అధికారులు గ్రామస్తులకు సూచించారు.

సాక్షి ఎఫెక్ట్..



మురికి కాలువలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు